క్లుప్తంగా

వైస్ ఎంపీపీకి యూత్ అధ్యక్షుడి కృతజ్ఞతలు



వైస్ ఎంపీపీ గొల్లపల్లిని కృతజ్ఞతలు చెబుతున్న వెంకట సుబ్రహ్మణ్యం

యలమంచిలి: వైఎస్సార్ సీపీ యలమంచిలి మండల యూత్ అధ్యక్షుడిగా నియమితులైన పులి వెంకట సుబ్రహ్మణ్యం సోమవారం వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ నియమనిబంధనలకు అనుగుణంగా పనిచేసి యువతలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం మండల అధ్యక్షుడు లంక కిషోర్, పార్టీ నాయకులు దిద్దే ప్రభాకరరావు, చంద్రపు గణపతి, యన్నాబత్తుల సుధీర్, నెల్లి స్వామి, చిల్లే సురేంద్ర బాబు, గుడిశే అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి కృషి



సమస్యలు వింటున్న ఆర్డీఓ రాజు

నరసాపురం: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం చర్యలు తీసుకోనున్నట్టు ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమంలో ఆర్డీఓ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. డివిజన్‌లోని పలు మండలాల నుంచి మొత్తం 57 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీఓ తెలిపారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డీఎస్పీ వేద

పాలకొల్లు సెంట్రల్: పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సబ్‌డివిజన్‌లో ఉన్న పోలీసులందరికీ హెల్త్ చెకప్ చేయిస్తున్నట్టు డీఎస్పీ శ్రీవేద తెలిపారు. సోమవారం స్థానిక న్యూ లైఫ్ ఆసుపత్రిలో పోలీసులకు హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలీసులు అందరికీ హెల్త్ చెకప్ చేయిస్తున్నామన్నారు. మొదటి రోజు 27 మందికి వైద్య పరీక్షలు చేశారని తెలిపారు. వారం రోజులు పాటు ఈ పరీక్షలు కొనసాగుతాయని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐలు కోలా రజనీకుమార్, గుత్తుల శ్రీనివాస్, ఎస్సైలు పృథ్వి, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ, వ్యాన్ ఢీ



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ సాయికుమార్

నరసాపురం రూరల్: లారీ, వ్యాన్ ఢీ కొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసాపురం మండలం బాడవ గ్రామానికి చెందిన గెల్లు సాయి కుమార్ మచిలీపట్నం కిరాయికి వెళ్లి వ్యాన్‌తో తిరిగి వస్తున్నాడు. మొగల్తూరు మండలం కాళీపట్నం చేరుకునే సరికి ఎదురాగా వస్తున్న లారీ వ్యాన్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ సాయి కుమార్ కుడి చేయి మోచేతి వరకు ఎముక విరిగింది. తలకు బలమైన గాయం అయ్యింది. స్థానికులు 108కి ఫోన్ చేసి గాయాల పాలైన డ్రైవర్‌ను నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భీమవరం పంపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్నేహితుడికి వితరణ



ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పెనుగొండ: ఇటీవల సిద్ధాంతంలో అనారోగ్యంతో మృతి చెందిన గుమ్మడి మల్లేశ్వరరావు కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. సిద్ధాంతంలో 1997–98 పదో తరగతి పూర్వ విద్యార్థులు మల్లేశ్వరరావు కుటుంబానికి సోమవారం రూ.25 వేలు సాయం అందించారు. మల్లేశ్వరరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మొత్తాన్ని కుమార్తె కీర్తి పేరున పోస్టాఫీసు అకౌంట్‌లో జమ చేశారు.

రహదారి వెతలు తీరేదెన్నడో?

బాపూజీపురం ప్రజల ఆవేదన



పెనుగొండ పెద్ద వంతెన వద్ద నుంచి బాపూజీ పురం వరకు రహదారి దుస్థితి

పెనుగొండ: బాపూజీపురం రైతులు, ప్రజల గోడు వినే నాథుడు కరువయ్యాడు. పెనుగొండ పెద్ద వంతెన వద్ద నుంచి బాపూజీ పురం వరకు రహదారి సమస్యపై మీకోసంలో ఫిర్యాదు చేసి నెలలు దాటుతున్నా స్పందించే నాథుడు కరువయ్యాడంటూ ప్రజలు వాపోతున్నారు. పెనుగొండ పెద్ద వంతెన నుంచి బాపూజీ పురం వరకు నరసాపురం కాలువ గట్టు సుమారు కిలో మీటరు పొడవు ఉంటుంది. కాలువ గట్టుపొడవునా పలువురు రైతు వ్యవసాయం సాగు చేస్తున్నారు. వీరితో పాటు బాపూజీ పురం వాసులు అత్యవసర పరిస్థితుల్లో ఇదే రహదారి రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి మొత్తం తుప్పలు పెరిగిపోవడంతో పాటు, పలువురు మలవిసర్జనకు ఇదే రహదారిని వినియోగించడం, మద్యంప్రియులు మద్యం సేవించి బాటిళ్లు రహదారిలో పగలకొడుతుండడంతో రైతులు, బాపూజీ పురం వాసులు రాకపోకలు సాగించడానికి నానావస్థలు పడుతున్నారు. కాళ్లల్లో మద్యం సీసా బాటిళ్లు పెంకులు గుచ్చుకొని గాయాలు పాలవుతున్నారు. మోటార్‌సైకిళ్లు టైర్లకు ప్యాచీలు పడి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. సాగు చేసిన పంట సైతం మిల్లులకు చేర్చుకోవడానికి రైతుల అష్టకష్టాలు పడాల్సివస్తుంది. రహదారి సమస్యపై మీకోసం నుంచి మొదలు జిల్లా కలెక్టరు, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి, డెప్యూటీ సీఎం వరకు వినతి పత్రాలు అందించిన ఫలితంలేదని రైతులు, ప్రజల వాపోతున్నారు.

ఏడు శాఖలకు వినతి



మీకోసంతో పాటు, ఏడు శాఖలకు వినతి పత్రాలు అందజేశాం. నాలుగైదు నెలలు దాటుతున్నా స్పందన లేదు. అధికారులు తక్షణం స్పందించి రైతులను ఆదుకోవాలి.

– తాడి వెంకట సత్యనారాయణ రెడ్డి, రైతు, పెనుగొండ

ఎన్నో బాధలు



ఈ రహదారిలో పొలాలకు వెళ్లాలంటే చాలు అవస్థలు పడుతున్నాం. పంటనూ రోడ్డుకు చేర్చుకోవడానికి అధికంగా ఖర్చు చేయాల్సివస్తుంది. సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లాం.

– చిట్నీడి సుబ్బారావు, రైతు, పెనుగొండ

కూటమి పాలనపై వ్యతిరేకత



నూతన కమిటీల సభ్యులను అభినందిస్తున్న గుడాల గోపి

వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గోపి

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ నాయకులపై ఉందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. ఇటీవల పార్టీలో నూతనంగా పదవులు పొందిన నాయకులను సోమవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన కొనసాగుతోందన్నారు. ఈ అరాచకపాలనను అంతం చేయాలంటే ఒక్క జగనన్న వల్లే సాధ్యమవుతుందని వివరించారు. పాలకొల్లు నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ సంఘటితంగా కలిసిమెలసి కూటమి పాలన అవినీతి అక్రమాలు, దౌర్జన్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ పట్టణ యూత్ వింగ్ అధ్యక్షుడు సనమండ సురేష్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి రమేష్‌లను అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యడ్ల తాతాజీ, పెచ్చెట్టి కృష్ణాజీ, ఖండవల్లి వాసు, రామాంజుల పెద్దమదు, దేవ రాజేష్, చెన్ను విజయ్, మామిడిశెట్టి చిట్టిబాబు, పాలపర్తి కృపానాథ్, గుడాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి అమానుషం

కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హారికపై టీడీపీ నాయకులు చేసిన దాడి అమానుషమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత అన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలనే కొనసాగుతోందన్నారు. మహిళలపై దాడులను ఖండించకపోవడం అన్యాయమని, మహిళలపట్ల కూటమి నాయకులకు ఎంత గౌరవం ఉందో ఈ ఘటనతో అర్థమవుతోందన్నారు. హారికపై దాడిని పార్టీ నాయకులు జోగాడ ఉమామహేశ్వరరావు, వీరా మల్లికార్జునుడు తదితరులు తీవ్రంగా ఖండించారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల నియామకం



వైఎస్సార్ సీపీ గవరపేట గ్రామ కమిటీ సభ్యులు



పార్టీ దిగమర్రు గ్రామ కమిటీ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్ సీపీ ఆదేశాల మేరకు పాలకొల్లు మండలంలోని అన్ని గ్రామాలకు కమిటీలను నియమించాలని పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స ఏసురాజు తెలిపారు. దిగమర్రు, గవరపేట, ఆగర్తిపాలెం గ్రామాల్లో గ్రామ కమిటీలు నియమించామన్నారు. ఈ కమిటీలన్నీ గ్రామాల్లో ఉన్న కార్యకర్తలు, అభిమానులను కలుపుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తాయని చెప్పారు. పార్టీ దిగమర్రు కమిటీ అధ్యక్షుడిగా ఆరేపల్లి రాఘవులు, సెక్రటరీగా రావి సుందర్ బిల్, గవరపేట అధ్యక్షుడిగా బీశెట్టి బాబ్జి, సెక్రటరీగా మల్ల సాంబశివ, ఆగర్తిపాలెం అధ్యక్షుడిగా పిల్లి శ్యాంబాబు, సెక్రటరీ దేవ అవీన్, మరికొందరు కార్యవర్గ సభ్యులను ఎంపికచేశామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మైలాబత్తుల మైఖేల్‌రాజు, వైస్ ఎంపీపీ పడవల సునీల్, కవురు గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావిశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం

- ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం విఫలం
- బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి కారుమూరి



తేతలిలో వృద్ధురాలితో కూటమి ప్రభుత్వ మోసం గురించి వివరిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: అన్నదాత సుఖీభవ ఇస్తామని రైతుల్ని, ఆడబిడ్డ నిధి ఇస్తామని మహిళల్ని, 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని బీసీ వర్గాలను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకు మండలంలోని తేతలి గ్రామం, పైడిపర్రులో సోమవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికార దాహంతో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్‌లు ఇష్టానుసారంగా హామీలు గుప్పించి ప్రజల్ని నిట్టనిలువునా వంచించారని మండిపడ్డారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఏ గుమ్మంలోకి వెళ్లినా చంద్రబాబు సూపర్‌సిక్స్‌తో పాటు 175 హామీలు గుప్పించి ఇప్పుడు మాకు సినిమా చూపిస్తున్నాడని శాపనార్థాలు పెడుతున్నారన్నారు. పింఛన్ వెయ్యి పెంపు, అరకొరగా తల్లికి వందనం, ఉచిత సిలిండర్ తప్ప ఏఒక్క పథకం కూడా అమలు చేయకపోవడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పులు చేశాడని, కూటమి ప్రభుత్వం రాగానే సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు ప్రతి మంగళవారం అప్పులు చేస్తూ అమరావతికి దారపోస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి నేతలు అందినకాడికి గాదికాడ పందికొక్కులా దోచుకుని దాచుకుంటున్నారని విమర్శించారు. జగన్ ఇచ్చిన పథకాలన్నీ నిలిపివేసి ఇస్తామన్న పథకాలు ఇవ్వకపోవడంతో పేదలు, దిగువ మధ్య తరగతి ప్రజానీకం అల్లాడుతున్నారని, నగదు చలామణి జరగక వ్యాపారాలు లేక వ్యాపారస్థులు గగ్గోలుపెడుతున్నారని అన్నారు. ఇటువంటి గడ్డుకాలం జగన్ హయాంలోని ఐదేళ్లలో ఎన్నడూ లేదని ఇదే విషయాన్ని ప్రజలు చర్చించుకుంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలు తెలిపే విధంగా ఉన్న క్యూఆర్ కోడ్ కరపత్రాలను కారుమూరి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తేతలి మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, కోట స్వామీజీ, భూపతిరాజు రామకృష్ణంరాజు, సరెళ్ల వీరతాత, దారం శ్రీను, మానేపల్లి సంపతరావు, వీరవల్లి సత్యనారాయణ, గారపాటి బాబూరావు, వందే చంద్రశేఖర్, గెడ్డం శేఖర్, గూట్ల ధనరాజు, నిమ్మకాయల రామకృష్ణ, పైడిపర్రులో నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో జిల్లా సెక్రటేరియట్ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, తణుకు పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి బలరామకృష్ణ, పంచాయితీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, కొత్తపల్లి చరణ్, కంచుమర్తి విశ్వేశ్వరరావు, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, షేక్ ఫహీమా, జల్లూరి జగదీష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సప్తసోమవారం ప్రదక్షిణలు



యలమంచిలి : వెంకటేశ్వరస్వామి



పాలకొల్లు సెంట్రల్ : సప్త సోమవారం ప్రదక్షిణల్లో పాల్గొన్న భక్తులు



పెనుగొండ : సంపత్ వినాయకుడు



పెనుగొండ : విఘ్నేశ్వరునికి లక్ష గరిక పూజ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సప్త సోమవారం ప్రదక్షిణలకు సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. ఉదయం నుంచి భక్తులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. సోమవారం ప్రదోషకాలం సమయంలో ప్రదక్షిణలు ప్రారంభించారు. ఏడు మారేడు దళాలు చేత పట్టుకుని ఏడు ప్రదక్షిణలు చేసి స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ప్రతి సోమవారం స్వామివారికి నిర్వహించే పంచహారతులు కార్యక్రమం ఏర్పాటు చేశారు. దాతలు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాస్, సూపరింటెండెంట్ పసుపులేటి వాసు, అర్చకులు కిష్టప్ప, అనిల్, వీరబాబులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

శాస్త్రోక్తంగా చాతుర్మాస పూజలు

యలమంచిలి: అబ్బిరాజుపాలెం గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో చాతుర్మాస పూజలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు పెద్దింటి సాయి రామాచార్యులు బ్రహ్మత్వంలో స్వామివారికి ప్రతిరోజు జపం, తులసి పూజ, పుష్పాలంకరణ చేస్తున్నారు. చాతుర్మాస్యం దీక్ష తీసుకున్న భక్తులు వారి ఇళ్ల వద్దే ప్రతి రోజు 108 నుంచి వెయ్యి వరకు ఓం నమో నారాయణాయ (కోటి అష్టాక్షరి), ఓం నమో భగవ తే వాసుదేవాయ (కోటి ద్వాదశాక్షరి) మంత్రాలు జపిస్తున్నారు. ఈ నెల ఆరో తేదిన తొలి ఏకాదశి సందర్భంగా ప్రారంభమైన చాతుర్మాస్యం దీక్ష నవంబర్ ఒకటో తేదీ వరకు నిర్విఘ్నంగా నిర్వహిస్తామని అర్చకులు సాయి రామాచార్యులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సంకష్ట హర చతుర్థి పూజలు

పెనుగొండ: ఆషాఢ బహుళ చతుర్థి సందర్భంగా పెనుగొండ పంచాయతీ వద్ద సంపత్ వినాయకుని సంకష్ట హర చతురుర్థి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి వినాయకునికి అభిషేకాలు, గరికలతో అర్చనలు చేశారు. లక్ష్మీ గణపతి హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు తేతలి శ్రీరామారెడ్డి ఏర్పాట్లు చేశారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహా రుద్ర యాగం

ఆచంట శ్రీరామేశ్వర స్వామి సత్రం వద్ద మహారుద్రయాగోత్సవాన్ని పండుగలా నిర్వహించారు. పరమేశ్వరునికి చండీ పారాయణ, కోటి కుంకుమార్చలు నిర్వహించారు. మహారుద్ర హోమం, చండీ హోమం, లక్ష్మీ గణపతి హోమాలు వేండి పండితులు ఆధ్వర్యంలో చేశబూరు. పరిసర ప్రాంతాల భక్తులు భారీగా తరలి వచ్చారు.

సిద్ధాంతంలో లక్ష గరిక పూజ

పెనుగొండ: సిద్ధాంతంలో ప్రసిద్ధి గాంచిన విఘ్నేశ్వరుని ఆలయంలో సోమవారం లక్ష గరిక పూజలు వైభవంగా నిర్వహించారు. ఆషాడ మాసం సంకష్ట హరచతుర్థి పురస్కరించుకొని సోమవారం ఉదయం నుంచి విఘ్నేశ్వరునికి పంచ ద్రవ్యంలో అభిషేకం చేశారు. కలగ వెంకట సత్యనారాయణ శర్మ బ్రహ్మత్వంలో బిక్కిన చల్లారావు, బిక్కిన విశ్వేశ్వరరావు దంపుతలచే లక్షగరిక పూజ, లక్ష్మీ గణపతి హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆగస్ట్ 15న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు

నరసాపురం: స్థానిక దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆగస్ట్ 15న వశిష్ట గోదావరి వలందర్‌రేవు వద్ద రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్టు సంఘ ప్రతినిధి రాబర్ట్ చెప్పారు. మధ్యా హ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీల్లో పాల్గొనేవారు రూ.200 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నా రు. సోలో సినిమా పాటలు పాడాలన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు.

21న వికలాంగ నిర్ధారణ పరీక్షలు

పెనుగొండ: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు అందించడానికి అర్హత నిర్ధారణ పరీక్షలు ఈ నెల 21న నిర్వహించనున్నట్టు ఆచంట ఎంపీడీఓ బి.కృష్ణమోహన్ సోమవారం తెలిపారు. నియోజకరవర్గంలోని ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర మండలాల్లోని దివ్యాంగులు పెనుగొండ పంచాయతీలో 21న నిర్వహించే శిబిరంలో అర్హత నిర్ధారణ పరీక్షలకు హాజరు కావాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందని, అర్హులకు వినికిడి, ట్రై సైకిల్ వంటి ఉపకరణాలు అందిస్తామని తెలిపారు. దివ్యాంగులు శిబిరానికి ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

బీసీ మహిళలకు రక్షణ కరువు



గుడాల సురేష్

యలమంచిలి: కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక దంపతులపై కూటమి నాయకులు చేసిన దాడి అప్రజాస్వామికమని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గుడాల సురేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ స్థానంలో ఉన్న ఒక బీసీ మహిళకే రక్షణ లేకపోతే సామాన్య మహిళలకు రక్షణ ఎక్కడ ఉంటుందని ఆయన ప్రశ్నించారు. హారిక దంపతులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిని వదిలేసి హారిక దంపతులను కారు ఎక్కించి పంపించేయటం సమంజసం కాదని పేర్కొన్నారు. పోలీసులు నిష్పాతిపక్షంగా విచారణ చేసి, దాడి చేసిన వారికి న్యాయస్థానంలో కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని సురేష్ కోరారు.

జూదరుల అరెస్ట్

నరసాపురం రూరల్: తుందుర్రు గ్రామం శివారు ప్రాంతంలో ఆదివారం పేకాట ఆడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.16,890 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై టి.వెంకట సురేశ్ తెలిపారు. సోమవారం వేములదీవి ఈస్ట్‌లో వ్యక్తిని అదుపులోకి తీసుకుని బైక్, రెండు కోడి పుంజులు, రూ.1,010 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమానికి తరలిరావాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు పిలుపు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి పీవీఎల్

కాళ్ల: నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 17వ తేదీన తలపెట్టిన 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు పిలుపునిచ్చారు. పెద అమీరం పార్టీ క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బూటకపు హామీలు ఇచ్చి ఇంటింటికీ మేనిఫెస్టో బాండ్లు పంపిణీ చేసిన కూటమి ప్రభుత్వం ప్రజల్ని నమ్మించి మోసం చేసిందని అన్నారు. దీంతో గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పాలనను ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటున్నారని అన్నారు. మరలా ప్రజలకు సుపరిపాలన అందాలంటే వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికు సాధ్యమని స్పష్టం చేశారు. పెదఅమిరం గ్రామంలో జరగనున్న బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బొత్స సత్యనారాయణ, ముదునూరి ప్రసాదరాజు, కారుమూరి నాగేశ్వరరావు కొరు శ్రీనివాస్ వంటి సీనియర్ నాయకులు పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొండేటి శివకుమార్, గణేశ్న రాంబాబు పెనుమత్స ఆంజనేయరాజు, నంద్యాల సీతారామయ్య, బొచ్చ అచ్చారావు, వేగేశ్న జయ రామకృష్ణంరాజు, సుంకర భోగేశ్వరరావు, గలవెల్లి ధనుంజయ్, శ్రీహరి రాజు, సాగిరాజు హరి వర్మ, చెల్లబోయిన పాపారావు, చేకూరి నరేంద్ర, అంబటి రమేష్, నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.